సాక్షి
కుమురం భీం

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



'ఆనకట్ట' తిప్పలు

నిజాం కాలంలో బెజ్జూర్‌లో మత్తడివాగుపై నిర్మించిన ఆనకట్ట నుంచి సాగునీరు పొలాలను చేరడం లేదు. దీంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు.

9లో▸



సమ్మె ప్రారంభం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సోమవారం నుంచి సమ్మె ప్రారంభించారు. రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

గరిష్టం/కనిష్టం

30.3 /25.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లాలో చాలా ప్రాంతాల్లో మోస్తరు వానలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీసీ కుల గణన చేపట్టాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీ కుల గణన తక్షణమే చేపట్టి, జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రూప్‌నర్ రమేశ్ మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారిని ఎస్టీ జాబితాలో, మాలి కులస్తులను బీసీలో, ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఆవిడపు ప్రణయ్, నాగోష్ మారుతి, మారుతి, బొట్టుపల్లి ప్రశాంత్, బాబురావ్, సోమేశ్వర్ తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

ఆసిఫాబాద్: శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుని, ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ ఫిర్యాదును చట్టపరంగా పరిష్కరించడంతోపాటు బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులను ఆదేశించారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే, మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఏవో శ్రీనివాసరావు, తదితరులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఒకటో అంతస్తులో సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం ప్రారంభించారు. డీఏవో రావూరి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విత్తన, ఎరువుల వ్యాపారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు మిలింద్, ఖాదర్ హుస్సేన్, గోపినాథ్, శ్రీనివాస్, వ్యాపారులు శ్రీనివాస్, గిరీశ్, ఆశిష్, నాందేవ్, ఖలీద్, గంగన్న పాల్గొన్నారు.

జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో సోమవారం జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు హాజరై మాట్లాడారు. సీనియర్ విభాగంలో 60 మంది విద్యార్థులు పాల్గొనగా, రాష్ట్రస్థాయి పోటీలకు 12 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్మల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్ తెలిపారు. ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, పీడీ తిరుపతి, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

6న వాలీబాల్ పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 6న అండర్ 14, 17 విభాగంలో వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాలల క్రీడల ప్రధాన అధికారి సాంబశివరావు తెలిపారు. తిర్యాణి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు ఉంటాయని, ఆసక్తి గలవారు బోనఫైడ్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు 82977 11480 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దర్జాగా పేకాట!

'సార్.. కాగజ్‌నగర్ పట్టణ శివారులోని ఓ ఫాంహౌస్‌లో పేకాట జోరుగా సాగుతోంది. మీరు వస్తే అందర్నీ పట్టుకోవచ్చు..' ఓ పోలీసు అధికారికి ప్రజాప్రతినిధి ఒకరు ఫోన్ చేసి చెప్పారు. సదరు అధికారి తక్షణమే తన డివిజన్ ఉన్నతాధికారికి ఈ విషయం తెలియజేయగా.. 'ఆ జూద శిబిరం వైపు నీవు వెళ్లకు. ఇక్కడితో విషయం మరిచిపో..' అంటూ అట్నుంచి హెచ్చరిక రావడంతో సదరు పోలీసు అధికారి మిన్నకుండి పోయారు.. పది రోజుల కిందట జరిగిన ఈ ఘటన జిల్లాలో జూదం ఏ స్థాయిలో జరుగుతోందో తెలియజేస్తోంది.



- జిల్లాలో విచ్చలవిడిగా జూద శిబిరాల నిర్వహణ
- పట్టణాలతోపాటు పల్లెల్లో ఏర్పాటు
- అధికార పార్టీ నేతల అండతో రెచ్చిపోతున్న వైనం
- రౌండ్‌కు రూ.5 వేలు, రూ.2వేలు వసూలు

సాక్షి, ఆసిఫాబాద్: ఒకప్పుడు ఎక్కడో రహస్యంగా సాగే జూదం.. ఇప్పుడు కొందరు అధికార పార్టీ నేతల అండతో ఊళ్లల్లోనే బహిరంగంగా జరుగుతోంది. ఎలాంటి పెట్టుబడి లేకుండా రూ.లక్షల్లో వస్తుండడంతో నేతలు జూదాన్ని ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. జిల్లాలో జూదం విచ్చలవిడిగా సాగుతోంది. పల్లెలు, పట్టణాలు.. కావేవీ పేకాట స్థావరాలకు అనర్హం అన్నట్లు తయారయ్యాయి. పాడి పంటలతో కళకళలాడే శివారు పల్లెలు సైతం విచ్చలవిడిగా వెలసిన జూద శిబిరాలతో కనిపిస్తున్నా యి. సమాచారం ఉన్నా.. అధికార పార్టీ నేతలు కావడంతో పోలీసులూ కిమ్మనడం లేదు. అడపాదడపా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేస్తూ చేతులు దులుపుకొంటున్నారు.

ముక్క.. మందూ ఫ్రీ!

కాగజ్‌నగర్ కేంద్రంగా రెండు జూద శిబిరాలు నడుస్తున్నాయి. ఈ రెండు జూద శిబిరాల్లో పేకాటరాయుళ్లకు నిర్వాహకులు ముక్కా... మందూ రెండూ ఫ్రీగా అందజేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో సిర్పూర్ రహదారి శివారులో ఉన్న ఓ ఫాంహౌస్‌పై పోలీసులు దాడులు చేసి కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి అక్కడికి పేకాటరాయుళ్లు రావడం తగ్గించారు. అదే సమయంలో దాని నిర్వాహకుడు మద్యం వేలం సమయంలో కాస్త బిజీగా ఉండడం కారణంగా గత కొన్నిరోజులుగా అక్కడ పేకాట నిర్వహించడం లేదని సమాచారం. అయితే అది కొద్ది రోజులు మాత్రమేనని.. మళ్లీ అక్కడ ఆట మొదలవుతుందని పేకాటరాయుళ్లు చెబుతున్నారు. ఇక ఈజ్‌గాం రహదారిలో రైల్వేబ్రిడ్జి దాటగానే మార్కెట్ కమిటీ ఎదురుగా ఉన్న ఓ ఎరువుల దుకాణం గోదాములోని మూడో అంతస్తులో పేకాట నిత్యం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా నడుస్తోందని తెలుస్తోంది. పోలీసులు హెచ్చరించినా అధికార పార్టీ నేత అండతో అక్కడ పేకాట జోరుగా సాగుతోంది. బడాబాబులు గతంలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో క్లబులకు వెళ్లి పేకాట ఆడేవారు. అక్కడ వాటిని మూసివేయడంతో ఇప్పుడు అధికారపార్టీ నేతలకు ముడుపులు ఇచ్చి జిల్లాలోనే దర్జాగా పేకాట ఆడటం గమనార్హం. పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేతలకు ఆదాయ వనరు..

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పలువురు నేతలు ప్రత్యక్షంగా జూద శిబిరాలను నిర్వహిస్తూ రెండు చేతులా అర్జిస్తున్నారు. వీరి అండతో అనుచరులూ బరి తెగిస్తున్నారు. ప్రధానంగా మూడు ముక్కలు, రమ్మీ(13 కార్డులు) వంటి ఆటలు ఆడిస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు గ్రామస్థాయిలో కూడా దుకాణాలు తెరిచారు. తాము సంపాదిస్తున్న దాంట్లో కీలక నేతలకు కొంత వాటా ఇస్తున్నారు. స్థానికంగా పోలీసులను కూడా మేనేజ్ చేస్తున్నట్లు సమాచారం. కాగజ్‌నగర్‌లో ఒక్కో టేబుల్ రమ్మీ ఆటకు రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. అలాగే మూడు ముక్కల ఆటైతే రౌండ్‌కు రూ.2 వేలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా ఇక్కడ ఇద్దరు నిర్వాహకులు రోజుకు రమ్మీ, మూడు ముక్కల ఆటలపై రోజుకు రూ.5 లక్షలు సంపాదిస్తున్నారు. అధికార పార్టీ నేతల ప్రమేయం ఉండడంతో వీరి జోలికి వెళ్లేందుకు పోలీసులు సాహసించడం లేదు. టాస్క్‌ఫోర్స్ దాడుల్లో అరకొరగా పట్టుపడుతున్నారు.

గురువులతోనే గుర్తింపు

సాక్షి, ఆసిఫాబాద్: నల్గొండ జిల్లాలోని మారుమూల పిల్లిగుండ్ల గిరిజన తండాలో ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలలో 1998లో టీచర్‌గా నా ప్రస్థానం మొదలైంది. విద్యార్థి దశలో అప్పారావు అనే ఇంగ్లిష్ టీచర్ నన్ను ప్రభావితం చేశారు. ఆయన ఎంతగానో ప్రోత్సహించేవారు. ఆ సార్ వల్లే నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇంటర్మీడియెట్‌లో కుమార్ లెక్చరర్ క్విజ్‌లు, వకృత్వం పోటీలు నిర్వహించి నాలోని ప్రతిభను వెలికితీశారు. నేను టీచర్‌గా పనిచేస్తూ అక్కడే ఆగిపోదామన్న దశలో రమణారెడ్డి, లక్ష్మారెడ్డి అనే లెక్చరర్లు.. 'మీ ప్రతిభకు ఇంకా పైస్థాయికి వెళ్లవచ్చు' అని ప్రోత్సహించారు. అందుకే నేనంటాను.. 'గురువులు లేనిదే నా ఈ స్థానం లేదని'..



కె.సురేశ్‌కుమార్, ఎస్పీ

- మరిన్ని కథనాలు 8లో..

రైతుల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా, విత్తనాలు, ఎరువుల పంపిణీ, రైతువేదికలు ఏర్పాటు, రుణమాఫీ వంటి కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ప్రతీ రైతు లబ్ధి పొందే విధంగా కార్యాచరణ రూపొందించి అర్హులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ జిల్లాలో రైతు రుణమాఫీ డబ్బులు జమ చేస్తున్నామని, ఖాతా నంబర్లు లభించని రైతులకు సంబంధించిన ఆధార్ నంబర్లతో పరిశీలిస్తున్నామని తెలిపారు. రుణమాఫీ పొందిన వారికి ఈ నెలాఖరులోగా కొత్త రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పింఛన్ల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తున్నామన్నారు. గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తుల పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లాలో 52.9 మి.మీ.ల వర్షం

ఆసిఫాబాద్: జిల్లాలో రెండు రోజులుగా వర్షం పడుతుండటంతో వాతావరణం చల్లబడింది. సోమవారం జిల్లాలో 52.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కుమురంభీం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 243 మీటర్లు కాగా 237.450 మీటర్లకు చేరింది. ఎగువన కురిసిన వర్షంతో ప్రాజెక్టులోకి భారీగా వరద చేరడంతో 5, 6 గేట్లు ఎత్తారు. ఇన్‌ఫ్లో 2,088 క్యూసెక్కులు ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అలాగే వట్టివాగు ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 239.500 మీటర్లు కాగా 238.450 మీటర్లకు చేరింది. వాంకిడిలో 72.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, జైనూర్‌లో 47.2, సిర్పూర్(యూ) 52.4, లింగాపూర్ 58.2, తిర్యాణి 35, రెబ్బెన 49, ఆసిఫాబాద్ 48.4, కెరమెరి 70.2, కాగజ్‌నగర్ 32.8, సిర్పూర్(టి) 46.6, కౌటాల 60.8, చింతలమానెపల్లి 64, బెజ్జూర్ 66.6, పెంచికల్‌పేట్ 50.4, దహెగాంలో 38.8 మి.మీ.ల వర్షం కురిసింది.



మత్స్యకారుల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు
- అడ ప్రాజెక్టులో చేపపిల్లలు విడుదల


ఆసిఫాబాద్‌రూరల్: మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఆసిఫాబాద్ మండలంలోని కుమురంభీం(అడ) ప్రాజెక్టులో జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ్‌కుమార్, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి సోమవారం చేపపిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత చేపపిల్లల పంపిణీతో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. సీఎం ప్రత్యేక చొరవ తీసుకుని మత్స్య సంపదను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో మత్స్య సంపద పెరగడంతో మత్స్యకారులకు ఆదాయం లభించడంతోపాటు ప్రజలకు నాణ్యమైన చేపలు స్థానికంగా లభిస్తున్నాయన్నారు. అనంతరం మత్స్యశాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 266 చిన్న చెరువులు, 14 పెద్ద చెరువులతోపాటు నాలుగు ప్రాజెక్టుల్లోకి కోటి 45 లక్షల చేపపిల్లలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, ఎంపీటీసీ మల్లేశ్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే సక్కు, అధికారులు, తదితరులు

టెట్ పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్: జిల్లాలో ఈ నెల 15న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం టెట్ నిర్వహణపై రెవెన్యూ, పోలీసు, విద్య, విద్యుత్, రవాణా, ఆర్టీసీ, వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్హత పరీక్షకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లో 21 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పేపర్లు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ అధికారులు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, సీసీ కెమెరాలు, తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్, డీఈవో అశోక్, ఆర్టీసీ డీఎం శ్రీధర్, డీటీవో గంధం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణు

సెకండ్ ఏఎన్ఎంల సమ్మె విరమణ

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ హామీ మేరకు వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ తెలిపారు. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ జిల్లా కేంద్రంలో సోమవారం డీఎంహెచ్‌వో రామకృష్ణకు వినతిపత్రం అందించారు. ఉపేందర్ మాట్లాడుతూ ఈ నెల 1న హైదరాబాద్‌లో జరిగిన చర్చల్లో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. కమిటీ వేసి సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, నాయకులు భాగ్య, భూదేవి, సునీత, శైలజ, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



విధుల్లోకి తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ

ఆసిఫాబాద్: ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా దివంగత వైఎస్సార్ హయాంలో అటవీహక్కు పత్రాలు పొందిన భూములకు రైతుబంధు పునరుద్ధరించాలని కెరమెరి మండలం కరంజీవాడకు చెందిన సోయం మాన్కు, ఆడ వెంకట్రావ్ కోరారు. కొన్నేళ్లుగా పోడు సాగు చేస్తున్న భూమికి పట్టా ఇప్పించాలని ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన బానోత్ రవీందర్ విన్నవించాడు. బుద్ధిమాంద్యం, శారీరక వైకల్యంతో బాధపడుతున్న తన కుమారుడికి పింఛన్ మంజూరు చేయాలని జైనూర్ మండలం జామినికి చెందిన శ్రీహరి అర్జీ సమర్పించాడు. ఇంటర్ పూర్తి చేసిన తనకు ఉపాధి అవకాశం కల్పించాలని బెజ్జూర్‌కు చెందిన ఇమ్రాన్‌ఖాన్ దరఖాస్తు చేసుకున్నాడు. భారీ వర్షానికి పెంకుటిళ్లు కూలిపోయి 20 కోళ్లు, రెండు మేకలు చనిపోయి నష్టపోయానని, పరిహారం ఇప్పించాలని పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లికి చెందిన కుమ్మరి పెంటయ్య కోరాడు. తండ్రి పేరుతో ఉన్న భూములు తన పేరుతో విరాసత్ చేయాలని పెంచికల్‌పేట్ మండలం గన్నారంకు చెందిన వాగాడి బిక్కు అర్జీ సమర్పించాడు. పట్టా భూమి ఆన్‌లైన్‌లో పీవోటీ కింద నమోదైందని, దీనిని సవరించి పాసుపుస్తకం జారీచేయాలని చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్‌కు చెందిన తాళ్లపెల్లి కల్పన దరఖాస్తు చేసుకుంది. పట్టా భూమిలో తనను సాగు చేయకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని బెజ్జూర్ మండలం మర్తిడికి చెందిన బెడికల చిన్నయ్య దరఖాస్తు చేసుకున్నాడు.



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే


వాటా ఇవ్వాలి



మా తండ్రి రాజుకు ముగ్గురు కుమారులతోపాటు నేను ఏకైక కుమార్తెను. తండ్రి చనిపోవడంతో వారసత్వంగా వచ్చిన రెబ్బెన మండలం జక్కులపెల్లిలోని సర్వే నం.15లోని 10.14 ఎకరాలు, సర్వే నం.67లోని 3.07 ఎకరాలు, సర్వే నం.180లోని 32 గుంటల భూమిలో సోదరులు నాకు వాటా ఇవ్వడం లేదు. తండ్రి నుంచి వచ్చిన భూమిలో నా వాటా ఇప్పించాలి.

– రాంటెంకి మొండక్క, భీమిని


సదరం సర్టిఫికెట్ ఇప్పించాలి



నా కుమారుడు ఎండీ ఫుర్ఖాన్‌కు రేచీకటి ఉంది. సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్ బుకింగ్ చేస్తే రిజెక్ట్ అయింది. ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే తీసుకోవడంలేదు. దాన్ని రద్దు చేసి తిరిగి సదరం సర్టిఫికెట్ ఇప్పించాలి.

– ఎండీ సిరాజ్, కాగజ్‌నగర్


పింఛన్ బందయింది



పుట్టుకతోనే కుడికాలు అవిటితనం ఉంది. గతంలో ఆసరా పింఛన్ వచ్చేది. సర్టిఫికెట్ రెన్యూవల్ చేయకపోవడంతో నాలుగేళ్లుగా పింఛన్ బందయింది. కొత్తగా స్లాట్ బుక్ అవుతలేదు. మూడేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్న. సదరం సర్టిఫికెట్ ఇప్పించి పింఛన్ పునరుద్ధరించాలి.

– ఎండీ అమీర్‌ఖాన్, కాగజ్‌నగర్

పక్కా ఇల్లు లేదు



మాకు పక్కా ఇల్లు లేక ఒకే గదిలో ఇబ్బందులు పడుతున్నాం. గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం అందించే ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకున్నా. నిరుపేదనైన నాకు గృహలక్ష్మి పథకం కింద డబ్బులు ఇప్పించాలి.

– దేగల స్వప్న, జన్కాపూర్, ఆసిఫాబాద్

కలెక్టరేట్ ఎదుట స్వర్ణకారుల ధర్నా

ఆసిఫాబాద్: కార్పొరేట్ జువెల్లరీ షాప్‌లతో ఉపాధి కోల్పోతున్న స్వర్ణకారులకు చేయూతనివ్వాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ శ్రీరాములు మాట్లాడుతూ బంగారు ఆభరణాల పనులు లేక ఆరు నెలల్లో 15 కుటుంబాలు ఆత్మహత్యకు పాల్పడ్డాయని పేర్కొన్నారు. తమిళనాడు తరహాలో రాష్ట్రంలోనూ స్వర్ణకారుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పోలీస్ వేధింపులు అరికట్టాలని, పుస్తెలు, మట్టెలు, ఉంగరాలు, లక్ష్మీరూపుల పనులను స్వర్ణకారులే చేసేలా, కార్పొరేట్ జువెల్లరీ దుకాణాల్లో విక్రయించకుండా జీవో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్వర్ణకారులు అకాల మరణం చెందితే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, గీత కార్మికులకు ఇస్తున్న విధంగా రూ.5 వేల పింఛన్ చెల్లించాలన్నారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాం వరప్రసాద్, కోశాధికారి చిలుకూరి మహేశ్, సంఘం ప్రతినిధులు శ్రీరామోజు రామయ్య, శ్రీరాం పెంటయ్య, వంశీ, కిష్టయ్య, రమేశ్, శ్రీనివాస్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న స్వర్ణకారులు

క్లుప్తంగా

పాముకాటుకు ఒకరు మృతి



మనోజ్‌కుమార్ మృతదేహం

దహెగాం(సిర్పూర్): పాముకాటుకు ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని పీకలగుండంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. ఆదివారం రాత్రి ఇంట్లో కొడిపె మనోజ్‌కుమార్(16) నిద్రిస్తున్నాడు. రాత్రి 2 గంటల ప్రాంతంలో పాముకాటేసింది. ఏదో కుట్టిందని ఇంట్లో చెప్పాడు. సోమవారం ఉదయం కుంచవెల్లి వరకు ప్రైవేటు వాహనంలో తరలించి అక్కడి నుంచి 108 అంబులెన్సులో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే పరీక్షించిన వైద్యసిబ్బంది మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సనత్‌కుమార్ పీహెచ్‌సీకి చేరుకుని కుటుంబ సభ్యులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

లారీ ఢీకొని 11 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

జైపూర్: మండలంలోని ఇందారం బస్టాండ్ సమీపంలో గల రాజీవ్ రహదారిపై సోమవారం లారీ ఢీకొని 11 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. రేచినీకు చెందిన గొల్లకాపరి ముద్వి రమేశ్ ఇందారం సమీపంలో గొర్రెలు పెంచుతూ సంచార జీవనం సాగిస్తున్నాడు. ఇదేక్రమంలో ఇందారం ఈసూబ్ ఫంక్షన్‌హాల్ సమీపంలో గొర్రెలు మేపుతుండగా శ్రీరాంపూర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ గొర్రెల మందను ఢీకొట్టడంతో 11 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని బాధితుడు వాపోయాడు.

చెరువులో పడి ఒకరి మృతి

భీమిని: చెరువులో ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కన్నెపల్లి మండలం కొత్తపల్లికి చెందిన పెద్దల ఎర్రయ్య (50) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఈయనకు ఇద్దరు భార్యలు. సంతానం లేదు. కొన్నేళ్లుగా ఎర్రయ్య మద్యానికి బానిసయ్యాడు. ఎంతకీ మద్యం మానకపోవడంతో భార్యలు ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో తల్లి చిన్నక్క వద్ద ఉంటున్నాడు. మనస్తాపంతో అప్పటి నుంచి మద్యం తాగుతూనే ఉన్నాడు. గతనెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం కొత్తపల్లి చెరువులో ఎర్రయ్య మృతదేహం తేలడంతో పశువుల కాపర్లు గమనించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి చిన్నక్క ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుకు రెండు మేకలు మృతి



మృతి చెందిన మేకలు

కెరమెరి: మండలంలోని నీంగూడ గ్రామంలో రైతు మొహర్లే రాజుకు చెందిన రెండు మేకలు పిడుగుపాటుకు సోమవారం మృతి చెందాయి. మధ్యాహ్నం వర్షం కురుస్తుండగా పొలం గట్టుపై మేకలపై గడ్డి మేస్తోంది. ఒక్కసారి పిడుగుపడడంతో అక్కడిక్కడే మృతిచెందాయి. వీటి విలువ రూ.24 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

బోధనలో ఉత్తమం

- ఫలితాలు సాధించేలా టీచర్ల కృషి
- సొంత ఖర్చులతో పుస్తకాలు
- సేవల్లో భాగస్వాములవుతూ..

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థుల్లో పాఠనాసక్తి కలిగించి నూతన పద్ధతులు, ప్రయోగాల ద్వారా వివరిస్తున్నారు. పిల్లలు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నారు. మరికొందరు సేవా కార్యక్రమంలోనూ భాగస్వాములవుతున్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహిస్తారు. ఉత్తమ సేవలందిస్తున్న టీచర్లపై 'సాక్షి' కథనం.





విద్యార్థులకు బోధిస్తున్న శ్రీలత

పిల్లల కోసం ఆటో ఏర్పాటు

దండేపల్లి: మండలంలోని పెద్దపేట ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి, హెచ్‌ఎం శ్రీలత చేస్తున్న సేవలు ఎనలేనివి. గతంలో విద్యార్థుల సంఖ్య 21. అక్కడ ఆమె విధుల్లో చేరిన తర్వాత, ఆ సంఖ్య 62కు చేరింది. పిల్లలు బడికి వచ్చేందుకు హెచ్‌ఎం ప్రతీనెల రూ.3 వేలు ఖర్చు చేస్తూ, ఓ ఆటో ఏర్పాటు చేసింది. మన ఊరు–మనబడిలో పాఠశాల ఎంపిక కావడంతో పాఠశాలలో మౌలిక వసతులు పెంపొందించారు. డ్యుయల్ డెస్క్ బెంచీలు, పాఠశాలను కార్పొరేట్‌గా తీర్చిదిద్దారు.

కార్పొరేట్.. సావర్‌కెడా పాఠశాలగా తీర్చిదిద్ది

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని సావర్‌కెడా పాఠశాలలో 2010 నవంబర్ 4న హెచ్‌ఎంగా కడెర్ల రంగయ్య బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి కార్పొరేట్ మాదిరిగా బడిని తీర్చిదిద్దారు. నాణ్యమైన విద్య అందించడంతో 120 మంది విద్యార్థులు వివిధ గురుకులాల్లో ప్రవేశం పొందారు. 9 మంది హైదరాబాద్‌లోని చుక్కా రామయ్య ట్రస్ట్‌లో సీటు సాధించారు. తల్లిదండ్రులు, దాతల నుంచి రూ.10 లక్షలు విరాళాలు సేకరించి పలు కార్యక్రమాలు చేపట్టారు. 'సార్'సినిమా దర్శకుడు అట్లూరి వెంకి ప్రత్యేకంగా హైదరాబాద్‌కు పిలిపించి ఆయన గురించి తెలుసుకున్నారు. పాఠశాలలు, గ్రంథాలయాల అభివృద్ధి కోసం రూ. 3 లక్షల విరాళం చేశారు. వచ్చిన డబ్బులను రంగయ్య జిల్లాలోని వివిధ పాఠశాలలకు, గ్రంథాలయాల ఏర్పాటుకు అందించారు. ఆ పాఠశాల మన ఊరు–మన బడి పనులు కొనసాగుతున్నాయి. కాగా మార్చి 24న ఆ పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఏ.దేవసేనా సందర్శించి మెచ్చుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2021లో కేంద్రం జాతీయ ఉత్తమ అవార్డుతో సత్కరించింది.



సన్మానిస్తున్న శ్రీ దేవసేన, కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, డీఈవో అశోక్

జీతం తీసుకోకుండా పాఠాలు



పాఠాలు బోధిస్తున్న వీణ

కడెర్ల రంగయ్య సతీమణి కడెర్ల వీణ. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ సావర్‌కెడా పాఠశాల విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోంది. 2013 నుంచి జీతం తీసుకోకుండా పాఠాలు చెబు తో ంది. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో వీణ తన సేవలందిస్తోంది. భర్త చేస్తున్న సేవల్లో తాను సైతం అంటూ బడి బాగుకోసం ఎంతో కృషి చేశారు. ఆమె అందిస్తున్న సేవలకు గాను ఈ మార్చిలో సావిత్రీబాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంది.

బడికి తీసుకెళ్తూ



బోధిస్తున్న ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్

కోటపల్లి: కోటపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చకినారపు ప్రవీణ్‌కుమార్. బడికి రాని విద్యార్థుల ఇళ్లకెళ్లి వారిని తీసుకెళ్తున్నాడు. సులభ పద్ధతుల్లో పాఠాలు బోధించడం, సొంత ఖర్చులతో చార్ట్స్, డ్రాయింగ్, మెటీరియల్స్ అందిస్తున్నాడు. రెండేళ్ల నుంచి విద్యార్థులు గురుకుల తదితర పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు.

సూపర్ మేడం



కోటపల్లి మండలం ఎడగట్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు పోసక్క. విద్యార్థులు బడికి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. పిల్లలు వ్యవసాయ పనులకు వెళ్తే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి బడికి వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ చూపారు. మొక్కలు నాటి పాఠశాలను పచ్చదనంగా మార్చారు. ఆ టీచర్‌ను సూపర్ మేడం అంటూ పలువురు అభినందిస్తున్నారు.

ఎస్‌సీఈఆర్టీ పుస్తకంలో చోటు



కౌటాల: ఎస్‌సీఈఆర్టీ విడుదల చేసిన పుస్తకంలో కౌటాల మండలంలోని నాగెపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాయిని శ్రీనివాస్ కార్యక్రమాలు ప్రచురితమయ్యాయి. నాగెపల్లి పాఠశాలలో 63 మంది చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఆయన ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. గతేడాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సైతం అందుకున్నారు. అలాగే మహిళల్లో చైతన్యం కల్పించేందుకు 'మహిళా ఆరోగ్య చైతన్య' పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేశారు. మద్యంతో కలిగే అనర్థాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

పడవపై వెళ్లి..పాఠాలు చెప్పి



పడవ ప్రయాణం చేస్తున్న రజిత, శిరీష

కెరమెరి(ఆసిఫాబాద్): రోడ్డు సౌకర్యం లేకున్నా.. పాఠశాలకు వెళ్లాలన్నా తపన వారిని పడవ ఎక్కించింది. టీచర్లు రజిత, శిరీష ఐదేళ్లుగా పడవ ప్రయాణం చేసి పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. ఈ ఇద్దరు ఆసిఫాబాద్‌లో ఇల్లు అద్దెకు తీసుకున్నారు. అక్కడి నుంచి ప్రతీరోజు కెరమెరి మండలం ఇందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు వచ్చి పాఠాలు చెబుతున్నారు. ఆసిఫాబాద్ నుంచి ధనోరా వరకు బస్సులో వస్తారు. ధనోరా నుంచి రవాణా సౌకర్యం లేకపోవడంతో సావర్‌ఖేడా గ్రామానికి చెందిన సదూ (పడవ నడిపే వ్యక్తి), శంకర్ బైక్‌పై ఇందాపూర్ పెద్దవాగు వరకు తీసుకెళ్తారు. ఇందుకు ప్రతినెల సదూకు. రూ.5 వేలు అందిస్తున్నారు.

పాఠశాలలో చదివి టీచర్‌గా మారి..

పెంచికల్‌పేట్: తన ఊరిలో చదువుకున్న ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. షెడ్వాయికు చెందిన చౌదరి వెంకటేశ్. తాను విధుల్లో చేరిన సమయంలో విద్యార్థుల సంఖ్య 36 ఉంది. వీవీగా పని చేసిన అనుభవంతో ఆ సంఖ్యను పెంచేందుకు కృషి చేశాడు. ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పని చేస్తూ మూడేళ్లల్లో విద్యార్థుల సంఖ్య 266కు చేరుకుంది. పాఠశాలలో ఆటస్థలం, మరుగుదొడ్లు, తరగతి గదులను అభివృద్ధి చేశారు. తొలిమెట్టులో రాష్ట్ర స్థాయిలో మాడ్యూల్స్ తయారీలో భాగస్వామ్యం వహించాడు.



బోధిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్

ఉత్తమ విద్య 'గురుకులం'



ఆన్‌లైన్‌లో బోధన చేస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లో ఉపాధ్యాయులు ఉత్తమ విద్య అందిస్తున్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో విద్యబోధన చేశారు. గురుకులంలో 8 మంది బోధన సిబ్బంది ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకుని రికార్డు సృష్టించారు. గతేడాది గణిత ఉపాధ్యాయుడు ప్రమోద్‌కుమార్ ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు పొందారు. ప్రిన్సిపాల్ ఐనాల సైదులు రాష్ట్రస్థాయిలో 2 సార్లు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్నారు.

కళలతో బోధన

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు కళలతో బోధన చేస్తున్నాడు వెంకట్రావు. సొంత ఖర్చులతో 100 మంది విద్యార్థులకు అభ్యాసనపత్రాలను జిరాక్స్ తీసి వాటిని ఫైల్ కవర్‌లో పెట్టి దానితో పాటు నోట్ పుస్తకం అందిస్తారు. వాటితో వారికి అభ్యసన సామర్థ్యాలు సాధించేలా బోధన చేస్తారు. కవి, గాయకుడు, కళాకారుడిగా జిల్లాలో ఉత్తమ బహుమతులు అందుకోగా, 2013 ఉమ్మడి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు.



కళా ప్రదర్శన ఇస్తున్న వెంకట్రావు

రైల్వేస్టేషన్‌లో మరుగుదొడ్లు ప్రారంభం

పాతమంచిర్యాల: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను సోమవారం సికింద్రాబాద్ డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్ ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎం విశాల్ అర్జున్, మంచిర్యాల స్టేషన్ మేనేజర్ ముత్తినేని రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

లక్సెట్టిపేట: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఏఎస్సై రామయ్య కథనం ప్రకారం.. మండలంలోని బోయవాడలో మేడి సుమలత నివాసం ఉంటోంది. సోదరులకు రాఖీ కట్టేందుకు గతనెల 30న పెద్దపల్లి జిల్లా పొట్యాలకు వెళ్లింది. సోమవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న 21 గ్రాముల వెండి పట్టీలు, 7 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఆమె ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టాటాఏస్ ట్రాలీ బ్యాటరీ చోరీ

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి హన్మాన్ ఆలయం సమీపంలో పార్కింగ్ చేసిన టాటాఏస్ ట్రాలీ నుంచి బ్యాటరీ ఆదివారం రాత్రి చోరీకి గురైంది. కొంకుముట్టి సత్యనారాయణకు చెందిన ట్రాలీ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీని అపహరించుకు వెళ్లారు. దీని విలువ రూ.6,500 ఉంటుందన్నారు. బాధితుడు తాండూర్ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు.

విద్యుత్ అవసరాలకు బొగ్గు ఉత్పత్తి చేయాలి



వీసీలో పాల్గొన్న శ్రీధర్

నస్పూర్: రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అనుగుణంగా తగినంత బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన అన్ని ఏరియాల జీఎంలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితోపాటు అదేవిధంగా 2.05 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయాలన్నారు. ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 720 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది మొదటి ఐదు నెలల్లో మెరుగైన బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించి నిర్దేశిత లక్ష్యసాధనకు ముందుకెళ్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి ఉద్యోగులకు నెలరోజుల్లో రూ.1726 కోట్లు వేజ్‌బోర్డు ఏరియర్స్, ఆ వెంటనే లాభాల వాటా రూ.700 కోట్లు, దీపావళి బోనస్ రూ.300 కోట్లు చెల్లిస్తామన్నారు. మొత్తం రూ.2800 కోట్లు చెల్లింపులు చేయనున్నామని వివరించారు. సగటున ఒక్కో కార్మికుడు రూ.6.5 లక్షలు అందుకోనున్నాడని తెలిపారు. సమావేశంలో ఆర్కే 5 అండ్ 6 గ్రూప్ ఏజెంట్ ఏవి రెడ్డి, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నం కోసం వచ్చి... అసువులుబాసి..



అరుణ్‌కుమార్ మృతదేహం



రాజేందర్ మృతదేహం



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న సరోజ

- విద్యుత్ షాక్‌తో భర్త, కొడుకు మృతి
- గుండెలు పగిలేలా రోదించిన తల్లి
- మంచిర్యాల జిల్లా కేంద్రంలో విషాదం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:'కొడుకా.. ఓ నా కొడుకా.. నన్ను ఎట్లా సూత్తవు కొడుకా.. బువ్వ కోసం ఇంటికచ్చి, పాణం పోగొట్టుకుంటిరి తండ్రీ.. దేవుడా.. నన్ను కూడా కొంచవో..' అంటూ భర్త, కొడుకును ఒకేసారి కోల్పోయిన బాధితురాలి ఆవేదన అందరినీ కంటతడి పెట్టించింది. జిల్లా కేంద్రంలోని ఏసీసీ కాలనీలో విద్యుత్‌షాక్‌తో ఎల్ల రాజేందర్(50), కొడుకు అరుణ్ కుమార్(17) సోమవారం మృతిచెందారు. సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న రాజేందర్, మెకానిక్‌గా పనిచేస్తున్న అరుణ్‌కుమార్ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చారు. దండెంపై రాజేందర్ టవల్ ఆరేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. తండ్రిని కాపాడే ప్రయత్నంలో అరుణ్‌కుమార్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. రెప్పపాటులో భర్త, కొడుకు కళ్ల ముందే మృత్యువాత పడడంతో సరోజన గుండెలు పగిలేలా రోదించింది. ప్రభుత్వాసుపత్రి సరోజ విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

తీరని విషాదం

తండ్రి, కొడుకు మరణంతో ఏసీసీ కాలనీలో విషాదం అలుముకుంది. ఆ కుటుంబంలో తీవ్ర దుఃఖం నింపింది. భర్త, కొడుకు మరణం తట్టుకోలేక రోదిస్తున్న సరోజను ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు.

ప్రాణం ఉందనుకున్నా...



కరెంట్.. కరెంట్ అని మా వదిన మొత్తుకుంటే.. ఉరికిపోయిన. తీగను పట్టుకుని ముందట అన్న ఉన్నడు. ఎనుక కొడుకు ఉన్నడు. నాకు డౌట్ వచ్చి కట్టెతోని తీగను కొట్టిన ఇద్దరూ కింద పడ్డరు. నా కాళ్లపై పడుకోబెట్టుకుని చాతీ మీద గట్టిగా నొక్కిన. చుట్టుపక్కల వాళ్లు వచిచ సాయం చేసింద్రు. ఒక్కసారిగా శ్వాస తీసుకున్నరు. పాణం ఉందనుకుని ఆస్పత్రికి తీసుకపోయినం. కానీ ప్రాణాలు దక్కలేదు.

– సారయ్య, రాజేందర్, తమ్ముడు,

అర్జీలు సత్వరం పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీలను శాఖలవారీగా పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీఎం అండ్‌హెచ్‌ఓ కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌ఓ సందీప్, ఆర్‌సీఓ గంగాధర్, జేడీఎం నాగభూషణం, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు పాల్గొన్నారు.

- తనకు అటవీ హక్కు పత్రం మంజూరు చేయాలని ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడకు చెందిన గంగన్న విన్నవించాడు.
- ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీ ఉద్యోగం ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలం గిన్నెదరి గ్రామానికి చెందిన రాథోడ్ ఆశ అర్జీ సమర్పించింది.
- స్వయం ఉపాధికి రుణం మంజూరు చేయాలని జైనూర్ మండలం జామిని గ్రామానికి చెందిన వినోద్ వినతిపత్రం అందించాడు.
- పిండిగిర్నీ దుకాణం కోసం ఆర్థి కసాయం అందించాలని ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ సచిన్ కోరారు.

పోలీసు అధికారుల సమావేశం

జన్నారం/కడెం: రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశాలతో జన్నారంలోని హరిత రిసార్ట్‌లో సోమవారం నిర్మల్, మంచిర్యాల జిల్లాల పోలీసు అధికారుల సమావేశం నిర్వహించారు. మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి హాజరయ్యారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా సరిహద్దు జిల్లాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రణాళికలు రూపొందించడానికి ముందస్తు సమావేశం నిర్వహించినట్లు ఏసీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రాబల్యం, ఎన్నికల్లో మద్యం, డబ్బు నియంత్రణకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఖానాపూర్ సీఐ మోహన్, నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, లక్సెట్టిపేట సీఐ కృష్ణ, జన్నారం, కడెం, దస్తురాబాద్ ఎస్సైలు సతీశ్, రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

'బీజేపీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలి'

బెల్లంపల్లి: వచ్చే ఎన్నికల్లో బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలని బీసీ కమిషన్ జాతీయ చైర్మన్, కేంద్రమాజీ మంత్రి హన్సరాజ్ గంగారాం కోరారు. బెల్లంపల్లి టేకులబస్తీలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు పార్టీ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. కమలనాథులు ఐక్యంగా పని చేసి బీజేపీ అభ్యర్థిని బెల్లంపల్లిలో గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ఆయన్ను నాయకులు సన్మానించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేశ్, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, అధికార ప్రతినిధి కృష్ణదేవరాయులు, నాయకులు తిరుపతి, సంతోష్, రాజులాల్, రామయ్య, రమేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్, రాజయ్య, సత్యనారాయణరెడ్డి, నవీన్, శ్రావణ్, నర్సింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హన్సరాజ్‌గంగారాం

టాటాఏస్ ట్రాలీ బ్యాటరీ చోరీ

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి హన్మాన్ ఆలయం సమీపంలో పార్కింగ్ చేసిన టాటాఏస్ ట్రాలీ నుంచి బ్యాటరీ ఆదివారం రాత్రి చోరీకి గురైంది. కొంకుముట్టి సత్యనారాయణకు చెందిన ట్రాలీ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీని అపహరించుకు వెళ్లారు. దీని విలువ రూ.6,500 ఉంటుందన్నారు. బాధితుడు తాండూర్ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు.